క్లుప్తంగా

రేపు నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



భట్టిప్రోలు: భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై రాజ్య సభలో అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం దేశ వ్యాప్తంగా వామ పక్ష పార్టీలు తలపెట్టిన నిరసన కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీపీఐ, సీపీఎం పార్టీ నాయకులు బి. శ్రీనివాసరావు, ఎం.సత్యన్నారాయణ పిలుపునిచ్చారు. శనివారం భట్టిప్రోలులోని సీపీఎం కార్యాలయంలో సమావేశం నిర్వహించి, మాట్లాడారు. భారత రాజ్యాంగ నిర్మాత పట్ల అమిత్ షా అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఆయా పార్టీల నాయకులు జి.బాలాజి, వి.శ్రీనివాసరావు, పి.మనోజ్, పి.నాగాంజనేయులు పాల్గొన్నారు.

వైభవంగా శనిత్రయోదశి



రేపల్లె రూరల్: పట్టణంలోని ఓల్డ్ టౌన్‌లో వేంచేసియున్న ఉమా మహేశ్వరస్వామి ఆలయంలో శనివారం శనిత్రయోదశి వేడుకలు ఆలయ అర్చకుడు చేబ్రోలు మహేష్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శనీశ్వరునికి నువ్వుల నూనెతో అభిషేకం నిర్వహించి, నల్లని వస్త్రాలతో అలంకరించారు. స్వామివారికి నువ్వులు, బెల్లం నైవేద్యంగా సమర్పించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. మార్గశిర మాసంలో వచ్చే శనివారం త్రయోదశి రోజున శనీశ్వరునికి పూజలు నిర్వహించడంతో సకల దోషాలు తొలగుతాయన్న నమ్మకంతో పూజలు చేస్తారని అర్చకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొని, మొక్కులు తీర్చుకున్నారు.

ధనుర్మాసం ముక్తి ప్రదాయిని

ఐలవరంలో కొనసాగుతున్న నగర సంకీర్తన



ఐలవరం(భట్టిప్రోలు): ధనుర్మాసం ముక్తి ప్రదాయినని ఎస్ఎస్ఎఫ్ బాపట్ల డివిజన్ ధర్మ ప్రచారక్ జంజనం హేమ శంకరరావు అన్నారు. మండలంలోని ఐలవరం గ్రామంలో ధనుర్మాసం నగర సంకీర్తన జరుగుతోంది. శంకరరావు మాట్లాడుతూ శ్రీ మహా విష్ణువును పూజించడం, ఈ మాసం దీక్షతో విష్ణు సంకీర్తన చేయడం వల్ల సకల శుభాలు కలుగుతాయని తెలిపారు. ఆలయ అర్చకులు దీవి రఘునాథ చక్రవర్తి మాట్లాడుతూ నెల రోజులూ స్థానిక వేణుగోపాలస్వామి దేవస్థానంలో గోత్ర నామాలతో పూజలు, గోదాదేవి, రంగనాయక స్వామి వారికి ప్రత్యేక పూజలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర సంకీర్తన నిర్వాహకులు కేబీవీ రమణ, సీహెచ్ సత్యనారాయణ, జి.జగన్ మోహన్ రావు, వి.కోటేశ్వరరావు, కె.నరసింహరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



బాపట్ల: హాజరత్ మస్తాన్ అవులియా దర్గాలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. బాబా 12వ ఉరుసు సందర్భంగా బీపీ, షుగర్ పరీక్షలు చేసి, రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 600 మంది రోగులకు వైద్య సేవలందించారు. వైద్యులు యు. వీరమ్మ, పి.రూస్సీరాణి, యు.శ్యామల, విజయలక్ష్మి, శ్రీనివాసరావు, వివేకానంద, కె.వి బ్రహ్మం, దర్గా కమిటీ సభ్యులు మున్నం వెంకట నాగేశ్వర్ రెడ్డి, అచ్యుతుని సురేంద్రనాథ్ పాల్గొన్నారు.

ప్రాణాలు పోతున్నా.. పట్టించుకోరా!

- అధ్వాన స్థితిలో కాల్వల బ్రిడ్జిలు, కల్వర్టులు
- సైడ్ వాల్స్ విరిగి.. ఏళ్లు గడిచినా పట్టించుకోని వైనం
- ప్రమాదభరితంగా మారిన కాల్వలు
- ఆదమరిస్తే..మృత్యువుని ఆహ్వానించినట్లే
- అధికారుల నిర్లక్ష్యం.. ప్రయాణికులకు శాపం



మూలపాలెం వెళ్లేదారిలో సైడ్ వాల్స్‌లేక ప్రమాద భరితంగా ఈస్ట్ స్వాంప్ డ్రైయిన్

బాపట్ల: అధికారుల నిర్లక్ష్యం ప్రజల పాలిట శాపంగా మారింది. బ్రిటీష్ కాలంలో నిర్మించిన బ్రిడ్జిలు నేటికి దర్శనం ఇస్తూనే ఉన్నాయి. అవి పూర్తిగా శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలి పోతాయో అన్నట్లున్నాయి. బ్రిడ్జిల సంగతి దేవుడెరుగు కనీసం ప్రమాదాల భారి నుంచి ప్రయాణికులను రక్షించేందుకు నిర్మించిన సైడ్ వాల్స్ పూర్తిగా విరిగిపోయి సుమారు మూడేళ్లు అవుతున్నా ఏ ఒక్క అధికారి వాటిపై దృష్టిసారించిన దాఖలాలు లేవు. కనీసం తాత్కాలిక మరమ్మతులైనా నిర్వహించాలని గ్రామస్తులు అనేక పర్యాయాలు వేడుకున్నప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. ఆర్అండ్‌బీ, డ్రెయినేజీ శాఖల అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రతి రెండు, మూడు నెలలకొకసారి ఆయా కాలువల వద్ద ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.

క్షణ క్షణం.. భయం



ప్రమాదాలకు నిలయంగా మారిన పోతురాజుకొత్తపాలెం వెళ్లే రహదారి

మండలంలోని పోతురాజు కొత్తపాలెం నుంచి వెదుళ్లపల్లి సమీపంలోని జీబీసీ రోడ్డు వరకు నిర్మించిన బీటీ రోడ్డుకు పోతురాజు కొత్తపాలెం శివారులో ఉన్న ఎత్తిపోతల పథకాల వద్ద కాల్వకు సైడ్ వాల్స్, దిమ్మెలు కూడా లేవు. రోడ్డు కూడా చిన్నదిగా ఉంది. గతంలో అటు వైపుగా వస్తున్న గేదెలు ఎదురుగా లారీ రావడంతో బెదిరిపోయి కాల్వలో పడి మృత్యువాత పడ్డాయి. అధికారులు స్పందించి సైడ్ వాల్స్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

అదమరిస్తే అంతే..

బాపట్ల నుంచి మూలపాలెం వెళ్లే దారిలో ఈస్ట్‌స్వాంప్ డ్రెయిన్‌పై ఉన్న బ్రిడ్జి శిథిలావస్థకు చేరి సైడ్ వాల్స్ పూర్తిగా దెబ్బతిన్నాయి. కాల్వ వెడల్పు తక్కువగా ఉండి చాలా లోతుగా ఉంది. రోడ్డు కూడా చిన్నదిగా ఉండటం వల్ల ఎదురుగా వస్తున్న వహనాలను తప్పించేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బ్రిడ్జికు సైడ్ వాల్స్ లేకపోవడం వల్ల ఖరీఫ్ సీజన్‌లో కురిసిన భారీ వర్షాలకు డ్రైయిన్ పొంగింది.

ప్రమాదాలకు కేరాఫ్.. వెదుళ్లపల్లి బ్రిడ్జి



ప్రమాద భరితంగా మారిన వెదుళ్ళపల్లి డ్రైయిన్

మండలంలోని వెదుళ్లపల్లి-మురుకుంటపాడు మార్గ మధ్యలో వెదుళ్లపల్లి డ్రెయినేజీపై నిర్మించిన బ్రిడ్జి పూర్తిగా శిథిలావస్థకు చేరింది. బ్రిడ్జి సైడ్ వాల్స్ పూర్తిగా విరిగిపోయాయి. దీంతో వెదుళ్లపల్లి నుంచి మురుకుంటపాడు, కంకటపాలెం వెళ్ళే ప్రజలు, వెదుళ్లపల్లి సమీపంలోని పంట పొలాలకు వెళ్లే రైతులు, పశుపోషకులు నిత్యం భయభ్రాంతులకు గురవుతున్నారు. గతంలో ఈ కాల్వలో పడి ఒకరు మృతిచెందగా, శ్రీనివాసరెడ్డి అనే రైతుకు చెందిన మూడు గేదెలు కాల్వలోపడి మృత్యువాత పడ్డాయి. అలాగే బాపట్ల నుంచి వెదుళ్లపల్లి వెళ్లే దారిలో ఉన్న బ్రిడ్జి సమీపంలోని మలుపు వద్ద ప్రమాద హెచ్చరికల బోర్డులు లేకపోవడం వల్ల నిత్యం ఆ ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్నాయి.

తస్మాత్ జాగ్రత్త..!



అప్పికట్ల-మర్రిపూడి మార్గ మధ్యలోని కల్వర్టు

మండలంలోని అప్పికట్ల-మర్రిపూడి మార్గం మధ్యలో పంట కాలువపై నిర్మించిన కల్వర్టు శిథిలావస్థకు చేరింది. కనీసం సైడ్ వాల్స్ కూడా లేకపోవడంతో నిత్యం ఆ ప్రదేశంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనికి తోడు రోడ్డు బ్రిడ్జి ముందు చాలా డౌన్‌గా ఉండటం, అక్కడే మలుపు తిరగాల్సి రావడంతో వాహన చోదకులకు నిత్యం ప్రమాదాలకు గురికావాల్సి వస్తోంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి కల్వర్టుకు సైడ్ వాల్స్ నిర్మించి, మలుపు తిరిగే ప్రదేశంలో ప్రమాద హెచ్చరికలు తెలియజేసే బోర్డును ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ

రేపల్లె రూరల్: పారిశుద్ధ్య పరిరక్షణకు ప్రత్యేక దృష్టి సారించినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అన్నారు. చెత్త నిల్వలను సేకరించే 50 పుష్ కార్ట్‌లను పట్టణంలోని ప్రకాశం స్కూల్ ఆవరణంలో శనివారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రధాన రహదారుల వెంబడి, అంతర్గత దారుల్లో పారిశుద్ధ్య సిబ్బందితో స్పెషల్ డ్రైవ్ ద్వారా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థాలను రహదారుల వెంబడి, కాల్వల్లో పడేయకుండా నిర్దేశిత ప్రదేశాల్లో, పుష్ కార్ట్‌లు నిర్వహించే పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలని ప్రజలను కోరారు. పుష్ కార్ట్ నిర్వహణ సిబ్బంది ప్రతి గృహానికి వెళ్ల తడి చెత్త - పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని స్పష్టం చేశారు. చెత్తను సేకరించే కార్మికులు సహనంతో విధులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ తూనుగుంట్ల కాశీవిశ్వనాథ గుప్త, కమిషనర్ కాకర్ల సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాత్రి రామచంద్ర రావు, డీఈ మధుసూదనరావు, ఏఈ జాన్‌శామ్యూల్, టీడీపీ నాయకుడు గూడపాటి శ్రీనివాసరావు, శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

నేడు సైబర్ నేరాలపై అవగాహన

తెనాలి: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, తెనాలి నెలవారీ సమావేశం ఆదివారం జరగనుంది. స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో సాయంత్రం 5.30 గంటలకు ఏర్పాటయే సమావేశానికి సంఘ అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షత వహిస్తారు. 'సైబర్ నేరాలు–అవగాహన'పై తెనాలి డీఎస్పీ బి.జనార్ధనరావు ప్రత్యేక ప్రసంగం చేస్తారు. సభ్యులందరూ హాజరై సైబర్ నేరాలపై అవగాహనకు రావాలని కార్యదర్శి ప్రసాదం పూర్ణచంద్ర రావు శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

ఐక్యపోరాటాలతో మతోన్మాద విధానాలను నిలువరించాలి

శతజయంతి సభలో అరసం నేత గోలి సీతారామయ్య

తెనాలి: దేశంలో ఐక్యపోరాటాలతో ప్రజాస్వామ్య పరిరక్షణ కృషిచేయటమే లోకం వెంకటేశ్వరరావు వంటి నిబద్ధత గల కమ్యూనిస్టులకు ఇచ్చే నిజమైన నివాళిగా అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా ఉపాధ్యక్షుడు, 'బుద్ధభూమి' మాసపత్రిక సంపాదకుడు గోలి సీతారామయ్య అన్నారు. నిబద్ధత గల కమ్యూనిస్టు, ప్రజాకళాకారుడు లోకం వెంకటేశ్వరరావు శతజయంతి వేడుకలను శనివారం ఇక్కడి తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. సభకు అరసం నాయకుడు కనపర్తి బెన్‌హర్ అధ్యక్షత వహించారు. గోలి సీతారామయ్య కీలకోపన్యాసం చేశారు. దేశంలో మతోన్మాద విధానాలను నిలువరించాల్సిన ఆవశ్యతక ఏర్పడిందనీ, ప్రజాస్వామ్య శక్తులన్నీ ఏకం కావాల్సిన చారిత్రక అవసరం నెలకొందన్నారు. తొలి నుంచి సీపీఐ పార్టీకే కట్టుబడిన లోకం, చివరి దశలో డాంగే స్థాపించిన యూసీపీఐలో చేరి, పార్టీ కేంద్ర కంట్రోలు కమీషను సభ్యులుగా, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా వ్యవహరించారని వివరించారు. దేశంలో కమ్యూనిస్టు ఉద్యమం బలోపేతం కావాలనే ప్రగాఢ కాంక్షను వ్యక్తంచేస్తూ, ఆ దిశగా నిరంతరం పనిచేసినట్టు వివరించారు. సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు వైనాలశెట్టి మూర్తి తన ప్రసంగంలో యూసీపీఐలో లోకం వెంకటేశ్వరరావు కృషిని వివరించారు. ప్రముఖ రచయిత ముత్తేవి రవీంద్రనాథ్ ఆంధ్రప్రదేశ్‌లో కమ్యూనిస్టు పార్టీ తొలి శాఖ, 1935లో తెనాలిలోనే ఏర్పాటైనట్టు చెప్పారు. కమ్యూనిస్టు ఉద్యమానికి తెనాలి ప్రాంతం పట్టుగొమ్మగా నిలిచిందనీ, అందుకు కృషిచేసిన యోధుల్లో లోకం వెంకటేశ్వరరావు ఒకరని వివరించారు. ప్రజానాట్యమండలి జాతీయ కార్యదర్శి గని తన ప్రసంగంలో లోకం వెంకటేశ్వరరావు దేశ సమైకత్య, సమగ్రతను కాంక్షించారనీ, కులమతాలకు వ్యతిరేకంగా పోరాటం చేశారని చెప్పారు. ప్రస్తుత సమాజం రోగంతో కొట్టుమిట్టాడుతోందనీ, స్వాతంత్ర్యం కోసం పోరాడింది గాంధీజీ, భగత్‌సింగ్ కాదంటున్నారనీ, గురు గోల్వాల్కర్ వంటి ఆర్ఎస్ఎస్ నేతల పేర్లు పుస్తకాల్లోకి ఎక్కుతున్నాయనీ వీటికి వ్యతిరేకంగా పోరాడినప్పుడే లోకం వెంకటేశ్వరరావుకు నిజమైన నివాళిగా చెప్పారు. డీఎస్ నాగేశ్వరరావు స్వాగతం పలికిన సభలో సీపీఐ నాయకుడు బొల్లిముంత కృష్ణ, సీపీఎం తెనాలి కార్యదర్శి కొల్లిపర బాబూప్రసాద్,డాక్టర్ వేమూరి శేషగిరిరావు, దాసరి రంగారావు, ఇందుపల్లి రాజారామ్ మాట్లాడారు. తెలంగాణ ప్రజానాట్యమండలి కార్యదర్శి పల్లె నరసింహం బృందం విప్లవ గీతాలను ఆలపించారు. సభానంతరం హైదరాబాద్‌కు చెందిన నరిశెట్టి రామారావు బృందంచే 'శ్రీకృష్ణరాయబారం' పడకసీనును ప్రదర్శించారు. తొలుత లోకం వెంకటేశ్వరరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. లోకం భాస్కరరావు, లోకం శ్యాంసుందరరావు, బండి సత్యవాణి, లోకం సురేష్ పర్యవేక్షించారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగించుకోవాలి



అర్జీలను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు



సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దారు సుశీల

రేపల్లె రూరల్: భూ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని తుమ్మల, మోళ్లగుంట పంచాయతీల్లో శనివారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తుమ్మలలో 12, మోళ్లగుంటలో 5 అర్జీలను అందినట్లు సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాంబాబు, వీర్వోలు పాల్గొన్నారు. అదేవిధంగా భూ సర్వే కార్యక్రమంపై ఉప్పాడిలో నిర్వహించిన ర్యాలీని తహసీల్దార్ శ్రీనివాసరావు ప్రారంభించి, రీ సర్వేకు సహకరించాలని కోరారు.

రెవెన్యూ సదస్సుకు 20 అర్జీలు

చావలి(వేమూరు): భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు సుశీల అన్నారు. వేమూరు మండలంలోని చావలి గ్రామంలో రెవెన్యూ సదస్సు శనివారం నిర్వహించారు. 20 అర్జీలు రైతులు అందజేశారు. వాటిని పరిష్కరించడం జరుగుతుందని తహసీల్దారు రైతులకు తెలిపారు. డిప్యూటీ తహసీల్దారు రవీంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

భట్టిప్రోలులో రెవెన్యూ సదస్సు

భట్టిప్రోలు: స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో శనివారం రెవెన్యూ సదస్సు జరిగింది. తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు పాల్గొని, మాట్లాడారు. భూమి క్రయ, విక్రయాలు ఒకరి పేరు మీద ఒకరు మార్పించేందుకు భూ రిజిస్ట్రేషన్లు ఉంటే సమస్యలను దరఖాస్తు రూపంలో తెలియ చేసుకోవచ్చన్నారు. ఈ సదస్సులో 28 అర్జీలు వచ్చాయని తెలిపారు. సర్పంచ్ దారా రవి కిరణ్మయి, పంచాయతీ కార్యదర్శి కోట శ్రీనివాసరావు, యర్రంశెట్టి కరుణ శ్రీనివాసరావు, దీవి వేంకటాచార్యులు, కనపర్తి సుందరరావు, ఆర్ఐ ఫణికుమార్, వీఆర్వోలు పాల్గొన్నారు.

అమర్తలూరు(వేమూరు): అమర్తలూరు మండల కేంద్రంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దారు నెహ్రూ రైతుల నుంచి 7 అర్జీలు స్వీకరించారు. వాటిని వెంటనే పరిష్కారిస్తామని తెలిపారు.

గత ప్రభుత్వం చేపట్టిన రీసర్వే కొనసాగింపు..



చుండూరు మండలంలోని మండూరు గ్రామంలో రీసర్వేపై అవగాహన ర్యాలీ



చిన పులివర్రు ప్రదర్శనలో తహసీల్దారు వెంకటేశ్వర్లు

చుండూరు(వేమూరు): ప్రభుత్వం రైతుల పొలాల రీ-సర్వే చేసి, వాటికి హద్దు రాళ్ల వేయనున్నట్లు తహసీల్దారు నాగరాజు తెలిపారు. చుండూరు మండలంలోని మండూరు గ్రామంలో రీ సర్వే కార్యక్రమం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రీ సర్వే కింద మండూరు గ్రామాన్ని ఎంపిక చేసిందన్నారు. గ్రామంలోని రైతులకు అవగాహన కల్పించేందుకు అన్ని వీధుల్లో ర్యాలీ నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాసరరావు, వీఆర్వో, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్కడ మొదలైందో.. అక్కడి నుంచే ప్రారంభం

వరహాపురం(వేమూరు): రైతుల భూములు రీ సర్వే చేసి, ప్రభుత్వం హద్దు రాళ్ల వేయడం జరుగుతుందని తహసీరు సుశీల పేర్కొన్నారు. మండలంలోని వరహాపురం గ్రామంలో రీ-సర్వేపై రైతులకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. గత ప్రభుత్వం రీసర్వేకు వరహాపురం గ్రామం ఎంపిక చేసిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం ఎంపిక చేసిన గ్రామాలు నుంచి రీ-సర్వేను ప్రారంభించడం జరుగుతుందని ఆమె తెలిపారు. రైతులందరూ దగ్గర ఉండి తమ భూములను రీ-సర్వే చేయించుకుని, హద్దు రాళ్ల వేసుకోవాలన్నారు. రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వం చేపట్టినే రీసర్వే కొనసాగింపు..

కొల్లూరు : భూ సమస్యలకు రీ-సర్వేతో శాశ్వత పరిష్కార మార్గం సుగమం అవుతుందని తహసీల్దార్ బి. వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని చినపులివర్రులో శనివారం భూముల రీసర్వేపై అవగాహనా ప్రదర్శన ఆయన నిర్వహించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేపట్టిన రీసర్వే ప్రక్రియను తిరిగి చేపట్టాలని ప్రస్తుత ప్రభుత్వం నిర్ణయించడంతో గురివిందపల్లి గ్రామాన్ని రీ సర్వేకు ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 'కృష్ణదేవరాయ' స్కాలర్‌షిప్‌ల ప్రదానం

తెనాలి: పట్టణానికి చెందిన కృష్ణదేవరాయ ఎడ్యుకేషనల్ ప్రోగ్రెసివ్ అసోసియేషన్, తెనాలి ఆధ్వర్యంలో ఆదివారం 20వ మెరిట్ స్కాలర్‌షిప్‌ల ప్రదానోత్సవం జరగనుంది. తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో మధ్యాహ్నం రెండు గంటలకు ఏర్పాటయే సభలో తెనాలి డివిజనులో 2023-24 సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థినీ విద్యార్థులకు స్కాలర్‌సిప్‌లను అందజేశారు.

సంఘ అధ్యక్షుడు బొల్లిముంత వెంకట నారాయణ అధ్యక్షత వహించే సభలో తులసి గ్రూపు సంస్థ చైర్మన్ తులసి రామచంద్రప్రభు, రంగిశెట్టి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ రంగిశెట్టి జగదీష్‌బాబు, పారిశ్రామికవేత్త డాక్టర్ బొందాడ రాఘవేంద్రరావు, ప్రియదర్శిని విద్యాసంస్థల చైర్మన్ చందు రామారావు, హిమాన్వీ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిఎడ్ హైదరాబాద్ ఎండీ అరవ రామకృష్ణ పాల్గొంటారు. సంఘ కార్యదర్శి తాడికొండ చిన్నబ్బాయి ఒక ప్రకటనలో వివరాలను తెలియజేశారు.

300 మందికి దుప్పట్లు పంపిణీ

ఇంటూరు(వేమూరు): పేద ప్రజలకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు సీనియర్ న్యాయవాది గుమ్మడి రవి రాజా తెలిపారు. అమర్తలూరు మండలంలోని ఇంటూరు గ్రామంలోని 300 మందికి శనివారం పంపిణీ చేసినట్లు చెప్పారు. పేదలు చలికి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు వీటిని అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మొద్దు జీవమణిమ్మ,, బట్టు కమల్‌నాథ్, తుమాటి రవి, కర్లపూడి భాను సంధ్యరాణి, కంభం నవీన్, కంచర్ల అబ్రహం, శీలం కోటి తుమాటి శోభన్, గుటిమాటి ధర్మారావు కనపర్తి ఇజ్రాయేలు, అంబేద్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.


వృక్షాలతోనే వాతావరణ సమతుల్యం



మొక్కలు నాటుతున్న కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టీసీ రవిచంద్రకుమార్

రేపల్లె రూరల్: వృక్షాలతోనే వాతావరణ సమతుల్య సాధ్యమని ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టీసీ రవిచంద్రకుమార్ అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా కళాశాల ఆవరణంలో శనివారం నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. చెట్లతో మానవునికి అవసరమైన ఆక్సిజన్ అందడమే కాకుండా భూమిని కాపాడే ఓజోన్ పొర సైతం రక్షింపబడుతుందన్నారు. పీడీ ఎం.బుజ్జిబాబు, ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ నర్సయ్య, ఎన్‌సీసీ కేర్ టేకర్ బాల గురవయ్య, ఎన్‌సీసీ క్యాడెట్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ



వేమూరు: పేద ప్రజలను అదుకునేందుకు సెయింట్ జోసఫ్ ఎడ్యుకేషన్ సొసైటీ ముందుంటుందని కరస్పాండెంట్ లోక ఆనందకుమార్ అన్నారు. మండల కేంద్రంలోని లూథరన్ చర్చిలో వేమూరి చెంచయ్య 6వ వర్ధంతి నిర్వహించారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చెంచయ్య అనేక విద్యా సంస్థలు స్థాపించి, పేద విద్యార్థులకు విద్యనందించారని కొనియాడారు. పేద ప్రజలను ఆదుకున్నారని గుర్తుచేశారు. ప్రతి ఏడాది చెంచయ్య వర్ధంతికి పేద ప్రజలకు దుస్తులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో పాస్టర్లు జోషి, లూకా, కుటుంబ సభ్యులు వేమూరి బిల్బీ, కావ్య కౌమది పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

90102 23706 (వేమూరు, రేపల్లె)

90109 62225 (పొన్నూరు, బాపట్ల)

Office mail : sakshigntadvt@gmail.com

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా / सेन्ट्रल बैंक ऑफ़ इंडिया

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

గుంటూరు బ్రాంచి (0835)

డి.నెం.6-5-69, 5/2, అరండల్‌పేట, గుంటూరు. ఫోన్: 0863-222063

ఇ-వేలం అమ్మకం ప్రకటన — అనుబంధం-IV A

[రూల్ 8(6) కి సంబంధించిన నిబంధనను చూడండి] స్థిరాస్తి అమ్మకమునకు సంబంధించిన అమ్మకపు ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 రూల్ 8(6) లోని నిబంధనలతో చదువుకోవలసిన సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తి అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన)

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు ఋణగ్రహీత(లు) చెల్లించవలసిన దిగువ తెలిపిన బకాయి మొత్తము వసూలు కొరకు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గుంటూరు బ్రాంచి యొక్క అధీకృత అధికారి వారిచే నిర్మాణాత్మక / భౌతికంగా స్వాధీనత పరుచుకోబడిన బ్యాంక్ తనఖా అధీనంలోనున్న దిగువ వివరించిన స్థిరాస్తి "ఎక్కడ ఎలా ఉన్నది అలానే" "ఏది ఎలా ఉంటే అలానే" మరియు "అక్కడ ఏమున్నదో అదే" పద్ధతిపై తేది.29-01-2025 న ఆన్‌లైన్ వెబ్‌పోర్టల్ PSB Alliance Pvt. Ltd. పోర్టల్ https://baanknet.com నందు విక్రయించబడునని యావన్మంది ప్రజానీకమునకు మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీత(లు)కు ఇందుమూలముగా సూచించటమైనది. రిజర్వుధర, ధరావత్తు మరియు స్థిరాస్తి వివరములు దిగువ తెలుపబడినవి. మిగిలిన వివరముల కొరకు మరియు అమ్మకం నిబంధనల కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్స్ వెబ్‌సైట్ https://www.centralbankofindia.co.in లేదా PSB Alliance Pvt. Ltd. పోర్టల్ https://baanknet.com లోని లింక్ ద్వారా తెలుసుకొనగలరు.

ఋణగ్రహీత: మెస్సర్స్ అటల్ బీహారి కాటన్ కార్పొరేషన్, యజమాని: శ్రీ కె.శంకరరావు, తండ్రి: పుల్లయ్య లేటు, 28-142, బాలాజీతోట, క్లాక్ టవర్ సెంటర్, చిలకలూరిపేట, గుంటూరు జిల్లా-522616.

13(2) డిమాండ్‌నోటీసు తేదీనాటికి బకాయిమొత్తం: 19-04-2022 తేదీనాటికి రూ.1,23,50,000/- ప్లస్ వడ్డీ మరియు ఖర్చులు
డిమాండ్ నోటీసు తేది: 19-04-2022 — స్వాధీనత నోటీసు 13(4) తేది: 13-07-2024

ఆస్తి యొక్క షెడ్యూలు / సెక్యూర్డు ఆస్తులు

గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్, రెడ్డిపాలెం గ్రామము పంచాయతీ, ఇన్నర్ రింగ్‌రోడ్డు & రైల్వే గేటుకు సమీపంలో, శ్రీ చైతన్య స్కూల్ ఎదురు, డి.నెం.316/బి నందు శ్రీ కోపూరి శంకరరావు పేరునగల 715 చ।।గ।। విస్తీర్ణముగల రెసిడెన్షియల్ ఖాళీస్థలమునకు సంబంధించిన యావదాస్తి. దీనికి హద్దులు: తూర్పు: 18 అ।। వెడల్పుగల రోడ్డు; పడమర: కటూరు వెంకటేశ్వర్లు; ఉత్తరం: వెండార్స్ చేత ఇతరులకు అమ్మిన స్థలము; దక్షిణం: భైరెడ్డి నహదేవరెడ్డి.

రిజర్వుధర: రూ.1,15,83,000/-	ధరావత్తు: రూ.11,58,300/-	బిడ్ పెంపుదల మొత్తం: రూ.10,000/-

ఇ-వేలం తేది & సమయం: 29-01-2025, ఉదయం 11.00 గం।।ల నుండి సా।। 04.00 గం।।లలోపు (10 నిమిషాల అపరిమిత పొడిగింపులతో)

EMDని సమర్పించుటకు ఆఖరు తేది: 29-01-2025 మ।। గం।। 03.30 ని।।లలోపు

ఆస్తి తనిఖీ చేసుకొనుట కొరకు తేది & సమయం: 20-01-2025 ఉ।। 11.00 గం।।ల నుండి సా।। 4.00 గం।।ల లోపు

1) ఇ-వేలం విక్రయంలో పాల్గొనడానికి ముందుగా, ఉద్దేశించిన బిడ్డర్లు కొనుగోలుదారు రిజిస్ట్రేషన్ - ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ చేయాలి మరియు కొనుగోలుదారు రిజిస్ట్రేషన్ తర్వాత కొనుగోలుదారు బిడ్డర్ నమోదుకు చాలా ముందుగానే డిజి లాకర్ KYC ద్వారా సర్వీస్ ప్రొవైడర్ వెబ్‌సైట్ PSB Alliance pvt ltd portal: https://baanknet.com/eauction-psb/bidder-registration ద్వారా EKYC చేయాలి. బిడ్డర్లు PSB Alliance pvt ltd portal: https://baanknet.com/eauction-psb/bidder-registration నందు వివరములు నమోదు చేసుకోవాలి. తదనంతరం, https://baanknet.com/eauction-psb/bidder-registration ద్వారా E-వ్యాలెట్‌లో EMD ని జమచేయాలి. బిడ్డరు విక్రయ సంబంధిత ఎడ్యుకేషనల్ వీడియోలు కొరకు PSB Alliance pvt ltd portal: https://baanknet.com ను సందర్శించండి. విక్రయం యొక్క పూర్తి నియమములు మరియు నిబంధనల కొరకు మా బ్యాంక్ యొక్క వెబ్‌సైట్: https://www.centralbankofindia.co.in నందు ఇవ్వబడిన లింక్‌ను చూడండి మరియు PSB Alliance pvt ltd portal: https://baanknet.com ను దర్శించండి.

2) హెచ్1 బిడ్డరు తమ బిడ్ మొత్తము (EMD అమౌంట్‌ను మినహాయించుకొని) RTGS/NEFT/ నగదు బదిలీ పద్ధతుల ద్వారా ఖాతా సంఖ్య. 3434218221, బ్యాంక్ ఆక్షన్ గుంటూరు రీజియన్, గుంటూరు బ్రాంచి, IFSC: CBIN0280835 (IFSC కోడ్ నందలి 5వ అక్షరము "జీరో") నందు జమచేయవలెను.

తదుపరి వివరములకు సంప్రదించండి: శ్రీ దిగంట శేఖర్ భానుమతరి, బ్రాంచ్ మేనేజర్, గుంటూరు బ్రాంచి, మొబైల్ నెం.6304906633

SARFAESI చట్టం 2002 యొక్క నిబంధన 8(6) క్రింద జారీచేసిన చట్టబద్ధ 30 రోజుల అమ్మకం ప్రకటన.

ఇందుమూలముగా ఋణగ్రహీతలు/హామీదారులు/తనఖాదారులు యొక్క సెక్యూర్డ్ స్థిరాస్తి సెక్యూర్డ్ క్రెడిటార్స్ వారి యొక్క బకాయి మొత్తములను తిరిగి వసూలు చేసికొనుటకు అమ్మకం చేయుగలరని ఈ ప్రకటన ద్వారా తెలియపరచడమైనది.

తేది: 27-12-2024, ప్రదేశము: గుంటూరు — సం/- అధీకృత అధికారి, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా